గర్భిణికి డెంగ్యూ పాజిటివ్

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 25: బోధన్ పట్టణంలోని 10 వార్డులోని గోసంబస్తీ ప్రాంతంలో నివసిస్తున్న తన్వీర్‌ఆస్మా అనే గర్భిణికి డెంగ్యూ పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. ఆమె గర్భిణి కావడం, జ్వరంతో బాధపడుతుండడంతో రక్తపరీక్షలు నిర్వహించారు. డెంగ్యూ వచ్చినట్లు నిర్ధారించారు.

మున్సిపల్, వైద్యశాఖ అధికారులపై కాలనీవాసుల ఆగ్రహం

10వ వార్డులో మహిళకు డెంగ్యూ వచ్చినట్లు గుర్తించిన వైద్యశాఖ, మున్సిపల్ అధికారులు బుధవారం ఆ వార్డుకు వెళ్లారు. వార్డులో మున్సిపల్‌శాఖ నిర్లక్ష్యం కారణంగానే డెంగ్యూ వచ్చిందంటూ కాలనీకి చెందిన పలువురు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రాంతాలను పరిశీలిస్తామని చెప్పినా, ముందుగానే దోమల మందు పిచికారీ చేయించాలని, డ్రైనేజీలు శుభ్రం చేయించాలని పలుమార్లు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా, నివేదించినా పట్టించుకోలేదని స్థానిక వార్డు కౌన్సిలర్ సావిత్రి భర్త గంగాధర్ గౌడ్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సీజనల్ వ్యాధులు ఎక్కువవుతున్నాయని ఆరోపించారు. అనంతరం అధికారులు కాలనీలో దోమల మందు పిచికారీ చేయించారు.

28న ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 25: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ – నిజామాబాద్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్ 14, 17 బాలబాలికల రెజ్లింగ్ పోటీలను ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా మంచిప్ప జడ్పీహెచ్‌ఎస్ గ్రౌండ్స్‌లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, విద్యార్థులు తమ వెంట బోనాఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఒక్కో వెయిట్ కేటగిరిలో ఒక్కో విద్యార్థి మాత్రమే పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పీడీ సంతోషి –7893732228, పీఈటీ దేవేందర్ –9550358444 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట,సెప్టెంబర్ 25: మండలంలోని జన్నేపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. బంగారు, వెండి ఆభరణలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. ఎస్సై వినయ్ కథనం.. గ్రామానికి చెందిన బల్లూరి సురేశ్ ఈనెల 10న ఇంటికి తాళం వేసి సొంత పనుల నిమిత్తం భార్య కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లారు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 34 తులాల వెండి, రూ. 30 వేల నగదును ఎత్తుకుపోయారు. బుధవారం ఉదయం వాకిలి ఊడ్చేందుకు వచ్చిన పనిమనిషి చూసి, నిజామాబాద్‌లో ఉంటున్న సురేశ్ కూతురుకు విషయం తెలిపింది. బాధితుడు సురేశ్ గ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థలాన్ని పోలీసులుపరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమికుడి ఆత్మహత్య

ఇందల్వాయి, సెప్టెంబర్ 25 : ప్రేమించిన యువతి నిరాకరించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన హొన్నాజీపేట్ అజయ్ (21) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి, ఉద్యోగం కోసం ట్రై చేశాడు. అజయ్ కొన్నినెలలుగా ఓ యువతిని ప్రేమించాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపం చెంది, ఈనెల 10న పురుగుల మందు తాగాడు. తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమించి, మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో మరో యువకుడు..

జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాము(27) పదేండ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. కాలికి రాడ్డు వేశారు. అప్పటినుంచి ఏ పనిచేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 20న గ్రామశివారులోని తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి,చెందాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పట్టణ ప్రణాళిక ఆగమాగం

ఇష్టారాజ్యంగా అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 25 : నిజామాబాద్ నగరపాలక సంస్థలో పట్టణ ప్రణాళిక విభాగం మొత్తం గాడి తప్పింది. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహారం నడుస్తున్నది. నగర మున్సిపల్ కార్యాలయంలో కొద్దిరోజుల క్రితం అవినీతి తిమింగలం దొరికినప్పటికీ అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదు. కిందిస్థాయిలో జరుగుతున్న అవినీతి పంథాతో మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తున్నది. నిర్మాణ అనుమతులకు సంబంధించి చిన్నాపెద్దా తేడా లేకుండా యథేచ్ఛగా వసూళ్ల పర్వం కొనసాగుతుందని, అసలు జీవో 168 అమలు పక్కనబెట్టి అధికారులు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తూ జేబులు నింపుకొంటున్నారని విమర్శలు ఉన్నాయి. పట్టణంలో అనుమతులు పొందిన భవనాలు నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపడుతున్నారా, అనుమతి ప్రకారం నిర్మాణాలు చేపట్టకపోతే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్న వినిపిస్తున్నది.

నిబంధనలు ఇలా..

టీఎస్ –బీపాస్ ప్రకారం 75 చదరపు గజాల వరకు విస్తీర్ణం గల ప్లాట్లలో గ్రౌండ్+1 వరకు నివాస భవనాలకు ఎలాంటి అనుమతి అవసరం లేదు. కేవలం రూపాయి నామమాత్రంగా చెల్లించి, తక్షణమే భవన నిర్మాణ అనుమతి పొందవచ్చును. 75 చదరపు గజాల నుంచి 239.20 చదరపు గజాల వరకు గ్రౌ+1, 239.20 చదరపు గజాల నుంచి 598 చదరపు గజాలలోపు నిర్మాణాలకు గ్రౌ+2, 598 చదరపు గజాల కన్నా ఎక్కువ లేదా గ్రౌండ్+2 కన్నా ఎక్కువ ఎత్తులో చేపట్టే నిర్మాణాలకు సింగిల్ విండో విధానం ద్వారా టీఎస్ –బీపాస్ ద్వారా అనుమతులు ఇస్తారు. నగరంలో నిర్మిస్తున్న భవనాల్లో దాదాపు ఎక్కడా కూడా అనుమతి ప్రకారం నిర్మాణాలు, పార్కింగ్, సెట్‌బ్యాక్ అనేవి లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎందుకు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారో వారికే తెలియాలి.

నగరంలోని పూలాంగ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల అనుమతులకు మించి నిర్మిస్తున్న భవనంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడమే ఇందుకు నిదర్శనం. నగరంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో ఓ నివాస గృహానికి సంబంధిచి 399.99 చదరపు గజాల్లో గ్రౌండ్+2 వరకే అనుమతులు ఉండగా, గ్రౌండ్ +3 నిర్మాణం చేపడుతున్నారని, అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని తొలగించాలని ఫొటోలతో సహా ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ విధంగా నగరంలో విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న, నిర్మించిన కట్టడాలపై చర్యలు తీసుకుంటారా లేదా వేచి చూడాల్సిందే.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం..

అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. జనరల్ తనిఖీల్లో భాగంగా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి

వస్త్ర షోరూంకు నోటీసులు

నోటీసులు అందజేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

వినాయక్‌నగర్/ కంఠేశ్వర్, సెప్టెంబర్ 25 : జిల్లాకేంద్రంలోని జవహర్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన వస్త్ర ఫ్యాషన్ షోరూం యజమానికి అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు బుధవారం నోటీసులు ఇచ్చారు. అగ్నిమాపక శాఖ నుంచి ఫైర్ సేఫ్టీ అనుమతులు తీసుకోకుండానే భవన నిర్మాణం చేపట్టినట్లు జిల్లా ఫైర్ అధికారి గౌతం దృష్టికి వచ్చిందని అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు. నోటీసు అందుకున్న నెలరోజుల వ్యవధిలో శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందని, లేకపోతే రెండో నోటీసు అందజేస్తామని తెలిపారు. మరో నెల రోజుల వ్యవధిలో అనుమతులు తీసుకోకపోతే కోర్టు ద్వారా కేసు నమోదు చేస్తామని ఎస్ఎఫ్‌వో నర్సింగ్‌రావు వెల్లడించారు. వస్త్ర ఫ్యాషన్ మాల్‌కు మున్సిపల్ అధికారులు మంగళవారం నోటీసులు జారీచేశారు. కొన్నినెలలుగా నిబంధనలకు విరుద్ధంగానిర్మాణ పనులు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, ఏడురోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు.

రాష్ట్రంలో వన్‌టౌన్ పీఎస్‌కు రెండో స్థానం

- డీజీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్ ప్రదానం

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రజిని

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 25 : రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో బెస్ట్ రిసెప్షన్ ఆఫీసర్లలో నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రెండో స్థానం దక్కిందని ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వన్‌టౌన్ రిసెప్షనిస్ట్, మహిళా కానిస్టేబుల్ రజిని మేనేజ్‌మెంట్ సిస్టం (సీసీటీఎన్ఎస్)లో ప్రతిభ చూపినందుకు హైదరాబాద్‌లో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ చేతుల మీదుగా బుధవారం ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో రిసెప్షన్ విభాగంలో రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. రజినికి సీపీ కల్మేశ్వర్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు అభినందనలు తెలిపారు.

29న రేషన్ డీలర్ల భర్తీకి పరీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్, సెప్టెంబర్ 25: రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో వచ్చిన మార్కుల ఆధారంగా బోధన్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్‌డీలర్ల స్థానాలను భర్తీచేస్తామని, రేషన్‌డీలర్ల నియామకం పారదర్శకంగా ఉంటుందని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బోధన్ డివిజన్‌లోని 18 చౌకధరల దుకాణాలకు రేషన్‌డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసి, దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. అభ్యర్థులకు ఈ నెల 29న బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. హాల్‌టిక్కెట్లు జారీచేశామని, అందనివారు పరీక్షా కేంద్రానికి వచ్చి పొందవచ్చని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష కేంద్రానికి బోధన్ తహసీల్దార్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని అన్నారు. రాతపరీక్ష రోజునే ఫలితాలను వెల్లడిస్తామన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఏవో శ్రీనివాస్, బోధన్ తహసీల్దార్ విఠల్ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

- రెండు గేట్ల ద్వారా మిగులు జలాల విడుదల

మోర్తాడ్, సెప్టెంబర్ 25: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతున్నది. ప్రాజెక్టులోకి బుధవారం 33,238 క్యూసెక్కుల వరద వచ్చి చేరగా, మిగులు జలాలను రెండు గేట్లు ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి నీటివిడుదల చేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రాజెక్ట్‌లో 1091 అడుగుల (80.501టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 6800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మీ కాలువకు 50, మిషన్‌భగీరథకు 231, వరదకాలువకు 18వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు సీపీ అభినందన

ట్రాఫిక్ కానిస్టేబుల్ అబ్బులును సన్మానిస్తున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 25 : జిల్లాకేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మారణాయుధాలు కలిగి ఉన్న కారును పట్టుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎం. అబ్బులు (పీసీ 1895)ను సీపీ కల్మేశ్వర్ బుధవారం అభినందించారు. ఈ నెల 23న సాయంత్రం కంఠేశ్వర్ బైపాస్ వద్ద స్విఫ్ట్ డిజైర్ కారు రాంగ్‌రూట్‌లో, ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసి వెళ్తుండగా సదరు కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. డ్రైవర్ కారులో నుంచి దిగి, ఓ వ్యక్తి ఆరోగ్యం బాగా లేని చెప్పాడు. అనుమానం వచ్చిన కానిస్టేబుల్ కారును తనిఖీ చేయగా.. కత్తులు, తల్వార్లు ఉన్నట్లు గుర్తించగా.. డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. కారులో ఉన్న మరో ఇద్దరు అనుమానితులతోపాటు కారును రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చాకచక్యంగా కారును పట్టుకున్న కానిస్టేబుల్‌ను అభిందించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలకు..

హైదరాబాద్‌లో ఏడాది పాటు శిక్షణ పొందిన ఎస్సైలు బాసర జోన్–2 పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో రిపోర్టు చేశారు. ట్రైనీ ఎస్సైలు సీపీ కల్మేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ వారిని అభినందించి, సూచనలు చేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో ఎస్.శ్రీనివాస్, పి.రాజేశ్వర్, కె.కిరణ్ పాల్, కె.శైలేందర్, సుస్మిత, ఎం.రమ, జె.సుహాసిని, ఎం.కళ్యాణి తదితరులు ఉన్నారు.

పోలీసు సిబ్బందికి ఎంపిక పరీక్షలు

పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 25 : కానిస్టేబుల్ నుంచి ఎస్సై స్థాయి వరకు పలు విభాగాల్లో ఎంపిక పరీక్షలను బుధవారం నిర్వహించారు. పరీక్షలను సీపీ కల్మేశ్వర్ పరిశీలించి మాట్లాడారు. నేరం జరిగినప్పుడు ఆధారాలను ఏవిధంగా సేకరించాలనే అంశంపై ఎంపిక పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన సిబ్బంది రాష్ట్రస్థాయిలో నిర్వహించే డ్యూటీమీట్‌లో పాల్గొంటారని తెలిపారు. అదనపు డీసీపీ కోటేశ్వరరావు, సీసీఎస్ ఏసీపీ రాఘవేంద్రచారి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 25 : నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన భూవివాదంలో రిటైర్డ్ పోలీస్ హెడ్‌కానిస్టేబుల్‌ను హత్యచేసిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదస్తు రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో రిటైర్డ్ కానిస్టేబుల్ కొక్కొండ రాంప్రసాద్, బోనిచెట్టి గంగమల్లు ఇండ్లు ఎదురెదురుగా ఉన్నాయి. ఇండ్ల మధ్య ఉన్న స్థలం విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. 25 ఫిబ్రవరి 2022న ఖానాపూర్ బైపాస్‌రోడ్డు వద్ద బైక్‌పై వెళ్తున్న రాంప్రసాద్ తలపై గంగమల్లు కర్రతో బలంగా కొట్టాడు. కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ జగదం నరేశ్ నేర విచారణ పూర్తి చేసి, కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. దీని ఆధారంగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన సెషన్స్ కోర్టు.. ముద్దాయి గంగమల్లుపై నేరం రుజువుకావడంతో జీవితఖైదుతో పాటు రూ. 2 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే అదనంగా ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన వ్యక్తికి మూడేండ్లు..

ఓ ఇంట్లోకి అక్రమంగా చొరబడి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి, మహిళను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన నేరస్తుడికి మూడేండ్ల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జి టి.శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రోడ్డులో నివసించే కార్తీక్ నుంచి రామదాసు రూ. 3 వేలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో 3 ఆగస్టు, 2023 రాత్రి గాజులపేట్‌లోని రామదాసు ఇంటికి వెళ్లి అతడి తల్లి ఇందిరాబాయిని కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడ్డాడు. నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి నేర విచారణ జరిపి సాక్ష్యాధారాలతో అభియోగపత్రాన్ని కోర్టులో సమర్పించారు. కార్తీక్‌పై నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేండ్ల జైలుశిక్షతోపాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- ‘ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు’లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. ‘కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు’ అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. ‘ఫ్యూచర్’ ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ–హబ్, టీ–వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్–2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా ‘ఏఐ గ్లోబల్ సమ్మిట్–2024’ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50–60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి

91827 77711

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ–హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ–హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ–వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

స్క్వాల్ ఫార్మేషన్‌తోనే కూలిన చెట్లు

- పునరుద్ధరణ జరగాలంటే వందేండ్లు
- నిర్ధారణకు వచ్చిన అటవీ శాస్త్రవేత్తలు
- విపత్తును పసికట్టిన వన్యప్రాణులు

ములుగు, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంతోపాటు అరేబియా సముద్రంలో గత నెల 31న ఏర్పడిన తుఫాన్‌ల కారణంగా గంటకు 125 కిలోమీటర్ల వేగంతో వీచిన భారీ గాలుల ఒత్తిడితో ఏర్పడిన స్క్వాల్ ఫార్మేషన్‌తోనే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవిలో భారీ ఎత్తున చెట్లు నేలకూలాయని అటవీ శాఖ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు 10 నుంచి 12 సంస్థలకు చెందిన నిష్ణాతులైన శాస్త్రవేత్తలతో వర్క్‌షాపు నిర్వహించి విధ్వంసానికి గల ప్రధాన కారణాలను అంచనా వేశారు. తాడ్వాయి, మేడారం, పస్రా అటవీ ప్రాంతంలో ఆగస్టు 31న జరిగిన దుర్ఘటన వల్ల 332 హెక్టార్లలో అడవికి నష్టం జరిగి 50 వేలకు పైగా చెట్లు నేలకూలాయని చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.30 కోట్ల నష్టం జరిగిందని, కలపతో కలుపుకుంటే రూ.100 కోట్ల నష్టం వరకు ఉంటుందని తెలిపారు. పర్యావరణం దృష్టితో చూస్తే రూ.100 కోట్లకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. దట్టమైన 100 నుంచి 200 ఏండ్ల చెట్లు కూలాయని, అంతటి దట్టమైన అడవి తిరిగి రూపొందాలంటే వందేండ్లు పడుతుందని వివరించారు. నష్టం జరిగిన ప్రదేశంలో చెట్లను కాపాడుకుంటే ఐదేండ్లలో అడవి ఏర్పడుతుందని, భారీ వృక్షాలు కావాలంటే చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఒకేసారి వచ్చిన తుఫాను వల్ల భారీ ఒత్తిడితో గాలులు వీచి మేఘాలు ఒక దానిపై ఒకటి వచ్చిన సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారని చెప్పారు. నష్టం జరిగిన రోజు సంఘటన ప్రాంతంలో 25 నుంచి 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతోపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, కొంత ప్రాంతంలో 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్టు కనుగొన్నామని తెలిపారు. వర్క్ షాపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎవరూ ఇంతటి తీవ్రతను చూడలేదని చెప్పారని వివరించారు. గతంలో మధ్యప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవుల్లోని అడవుల్లో కొద్ది ప్రాంతంలో చెట్లకు నష్టం జరిగిందని, ప్రస్తుతం తాడ్వాయి అడవుల్లో భారీ మొత్తంలో నష్టం జరిగిందని చెప్పారు. చెట్లు కూలిన ప్రాంతంలో వన్యప్రాణులకు హాని జరగలేదని, విపత్తును ముందే తెలుసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. దుర్ఘటనకు గల కారణాలపై నివేదిక రూపొందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు.

• ఆరోగ్య ప్రదాత కేసీఆర్

ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. – గోదావరిఖని

• పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి..

వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి కార్మికుల కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఒరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. – నెక్కొండ